భారత్‌కు భంగపాటు

తొలి మ్యాచ్‌లో భారత్ ఘోర ఓటమి • కివీస్ సునాయస విజయం • బ్యాటింగ్ వైఫల్యంతో టీమ్‌ఇండియా కుదేలు • మహిళల టీ20 ప్రపంచకప్

మహిళల టీ20 ప్రపంచకప్ వేటను భారత్ ఓటమితో ప్రారంభించింది. టైటిల్ ఫేవరెట్లలో ఒకటిగా బరిలోకి దిగిన టీమ్‌ఇండియాకు బ్యాటింగ్ వైఫల్యంతో న్యూజిలాండ్ చేతిలో పరాభవం తప్పలేదు. కివీస్ నిర్దేశించిన 161 పరుగుల మోస్తరు లక్ష్య ఛేదనలో భారత టాపార్డర్ దారుణంగా విఫలమవడంతో ఓటమి అనివార్యమైంది. స్మృతి మంధాన, షఫాలీ వర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ తీవ్రంగా నిరాశపరిచారు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న కివీస్.. టోర్నీని ఘనంగా మొదలుపెట్టింది.

హర్మన్ (15)

దుబాయ్: భారీ ఆశలతో మహిళల టీ20 ప్రపంచకప్ టోర్నీకి వెళ్లిన భారత క్రికెట్ జట్టుకు తొలి మ్యాచ్‌లోనే ఘోర పరాభవం ఎదురైంది. మొదటి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేనకు న్యూజిలాండ్ షాకిచ్చింది. దుబాయ్ లోని ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో కివీస్ అమ్మాయిలు.. భారత్‌ను 58 పరుగుల తేడాతో ఓడించి టోర్నీలో ఘనంగా బోణీ కొట్టారు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్.. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 160 పరుగులు చేసింది. కెప్టెన్ సోఫీ డివైన్ (36 బంతుల్లో 57 నాటౌట్, 7 ఫోర్లు) ధనాధన్ ఆటతో విరుచుకుపడగా ఓపెనర్ ఫ్లిమ్మర్ (23 బంతుల్లో 34, 3 ఫోర్లు, 1 సిక్స్) వేగంగా ఆడింది. భారత బౌలర్లలో రేణుకా సింగ్ (2/27) రాణించింది. లక్ష్య ఛేదనలో భారత్ 19 ఓవర్లలో 102 పరుగులకే కుప్పకూలింది. భారత్ తరపున ఒక్క బ్యాటర్ కూడా 20 పరుగుల మార్కును అందుకోలేకపోయారు. హర్మన్‌ప్రీత్ కౌర్ (15) టాప్ స్కోరర్. కివీస్ పేసర్ రొస్‌మెరీ మెయిర్ (4/19), లీ తహుహు (3/15), ఈడెన్ కార్సన్ (2/34) ఆ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. డివైన్‌కే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

రాణించిన డివైన్, ఫ్లిమ్మర్..

మొదట బ్యాటింగ్ చేసిన కివీస్ ఆది నుంచే దూకుడుగా ఆడింది. ఓపెనర్లు సూజి బేట్స్ (27), ఫ్లిమ్మర్ తొలి వికెట్‌కు 7.4 ఓవర్లలోనే 67 పరుగులు జతచేశారు. వీరి దూకుడుతో 6.4 ఓవర్లలోనే ఆ జట్టు అర్ధ సెంచరీ భాగస్వామ్యాన్ని పూర్తిచేసింది. తెలుగమ్మాయి అరుంధతి రెడ్డి ఇన్నింగ్స్ 8వ ఓవర్‌లో నాలుగో బంతికి బేట్స్‌ను ఔట్ చేసి ఈ జోడీని విడదీసింది. మరుసటి ఓవర్లోనే ఫ్లిమ్మర్.. ఆశా శోభన బౌలింగ్‌లో స్మృతి మంధానకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. ఆ తర్వాత కివీస్ ఇన్నింగ్స్ కాస్త నెమ్మదించింది. డివైన్ సింగిల్స్‌కే పరిమితమైంది. అమెలియా కెర్ (13)ను రేణుకా వెనక్కి పంపింది. కానీ దీప్తి శర్మ 18వ ఓవర్లో బ్రూక్ హాలిడే (16) రెండు ఫోర్లు కొట్టగా డివైన్ కూడా ఓ బౌండరీ బాది స్కోరు వేగాన్ని పెంచింది. ఆఖరి ఓవర్లో మూడో బంతిని బౌండరీకి తరలించిన డివైన్.. హాఫ్ సెంచరీని పూర్తిచేసుకుంది.

భారత్ టపటప..

మోస్తరు లక్ష్య ఛేదనలో భారత్ రెండో ఓవర్ నుంచే క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. స్టార్ బ్యాటర్ షఫాలీ వర్మ (2) రెండో ఓవర్ తొలి బంతికే ఈడెన్ కార్సన్‌కు రిటర్న్ క్యాచ్ ఇవ్వడంతో భారత వికెట్ల పతనం మొదలైంది. ఇన్నింగ్స్ తొలి బంతినే బౌండరీకి తరలించిన స్మృతి మంధాన (12) కూడా కార్సన్ 5వ ఓవర్లో గ్రీన్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరింది. మెయిర్ 6వ ఓవర్లో హర్మన్‌ప్రీత్ వికెట్ల ముందు దొరికిపోయింది. టీమ్‌ఇండియా అభిమానులు భారీ ఆశలు పెట్టుకున్న జెమీమా రోడ్రిగ్స్ (13), రిచా ఘోష్ (12) తీవ్రంగా నిరాశపరిచారు. సీనియర్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (13), బౌలింగ్ ఆల్‌రౌండర్ పూజా వస్త్రకార్ (8) సైతం విఫలమయ్యారు. ఈ టోర్నీలో భారత్.. ఆదివారం దాయాది పాకిస్థాన్‌తో ఆడాల్సి ఉంది.

సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్: 20 ఓవర్లలో 160/4 (డివైన్ 57 నాటౌట్, ఫ్లిమ్మర్ 34, రేణుకా 2/27, ఆశా 1/22)

భారత్ : 19 ఓవర్లలో 102 ఆలౌట్ (హర్మన్‌ప్రీత్ 15, జెమీమా 13, మెయిర్ 4/19, తహుహు 3/15)

నేటి నుంచే టికెట్ల విక్రయం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: భారత్, బంగ్లాదేశ్ మధ్య ఈనెల 12న హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో జరగాల్సిన మూడో టీ20 మ్యాచ్‌కు శనివారం నుంచి ఆన్‌లైన్‌లో టికెట్లు విక్రయించనున్నట్టు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్ మోహన్‌రావు తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12:30 గంటల నుంచి పేటీఎం ఇన్‌సైడర్ వెబ్‌సైట్/ఆప్‌లో టికెట్లను విక్రయించనున్నట్టు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన టికెట్లను ఈనెల 8 నంచి 12 దాకా జింఖానా మైదానంలో రిడంప్షన్ చేసుకోవాలని సూచించారు. ఆఫ్‌లైన్‌లో టికెట్లను విక్రయించడం లేదని ఆయన స్పష్టం చేశారు.

రెండో రౌండ్‌కు బోపన్న ద్వయం

షాంఘై (చైనా): భారత టెన్నిస్ డబుల్స్ ఆటగాడు రోహన్ బోపన్న, తన సహచర ఆటగాడు ఇవాన్ డొడిగ్ (క్రొయేషియా) ఏటీపీ మాస్టర్స్ 1000 షాంఘై టోర్నీ రెండో రౌండ్‌కు ప్రవేశించారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న-డొడిగ్ జోడీ.. 6-4, 6-3తో వరుస సెట్లలో పాబ్లో కరెనొ-పెడ్రొ మార్టిన్ (స్పెయిన్)ను వరుస సెట్లలో ఓడించింది.

సబలెంకకు షాక్

బీజింగ్ (చైనా): ఈ ఏడాది ఆస్ట్రేలియా ఓపెన్‌తో పాటు ఇటీవలే ముగిసిన యూఎస్ ఓపెన్ గెలిచిన జోరుమీదున్న ప్రపంచ రెండో ర్యాంకర్ అరీనా సబలెంక (బెలారస్)కు చైనా ఓపెన్‌లో అనూహ్య షాక్ తగిలిం ది. ఈ టోర్నీ మహిళల క్వార్టర్స్‌లో సబలెంక.. 6-7 (5/7), 6-2, 4-6తో కరోలినా ముచోవా (చెక్ రిపబ్లిక్) చేతిలో పరాభవం పాలైంది. దీంతో ఆమె 15 వరుస విజయాలకు బ్రేక్ పడ్డట్టైంది. సెమీస్‌లో ముచోవా.. చైనా అమ్మాయి కిన్వెన్ జంగ్‌తో తలపడనుంది. మరో సెమీస్ కోకో గాఫ్, పౌలా బడోసా మధ్య జరుగనుంది.

భారత షూటర్లకు మరో స్వర్ణం

లిమా (పెరూ): ఇంటర్నేషనల్ షూటింగ్ స్పోర్ట్స్ ఫెడరేషన్ (ఐఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో లిమా వేదికగా జరుగుతున్న జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత్ పతక జోరును కొనసాగిస్తోంది. పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టోల్ టీమ్ కాంపిటీషన్ ఫైనల్‌లో ముకేశ్ నెలవెల్లి, రాజ్‌వర్ధన్ పాటిల్, హర్సిమర్ సింగ్ కూడిన భారత త్రయం పసిడి సాధించింది. ఈ టోర్నీలో భారత్‌కు ఇది 11వ స్వర్ణం. ఇదే ఈవెంట్ వ్యక్తిగత ఈవెంట్‌లో రాజ్‌వర్ధన్, ముకేశ్ వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచారు. మొత్తంగా ఈ టోర్నీలో భారత్ 11 స్వర్ణాలు, 1 రజతం, 4 కాంస్యాలతో 16 పతకాలతో పాయింట్ల పట్టికలో అగ్ర స్థానంలో కొనసాగుతోంది.

అజారుద్దీన్‌కు మరోసారి నోటీసులు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) మాజీ అధ్యక్షుడు, తెలంగాణ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ అజారుద్దీన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శుక్రవారం మరోసారి నోటీసులు జారీ చేసింది. ఆయన హయాంలో హెచ్‌సీఏలో జరిగిన రూ. 20 కోట్ల అక్రమాలపై విచారణకు హాజరుకావాలని ఈడీ అజారుద్దీన్‌ను ఆదేశించిన విషయం తెలిసిందే. అజారుద్దీన్ గురువారమే విచారణకు హాజరుకావాల్సి ఉండగా వ్యక్తిగత కారణాల దృష్ట్యా తాను అందుబాటులో ఉండటం లేదని, వారం రోజులు గడువు కావాలని కోరుతూ ఆయన ఈడీ అధికారులకు లేఖ రాశారు. లేఖను పరిగణనలోకి తీసుకున్న ఈడీ.. మరో నోటీసు జారీ చేస్తూ ఈనెల 8న విచారణకు హాజరుకావాలని ఆయనకు సూచించింది.

ముంబైకి భారీ ఆధిక్యం

రసవత్తరంగా ఇరానీ కప్

లక్నో: ప్రతిష్టాత్మక ఇరానీ కప్‌లో రంజీ చాంపియన్ ముంబై భారీ ఆధిక్యంతో ఈ మ్యాచ్‌ను శాసించే స్థితికి చేరింది. లక్నోలోని ఏకనా స్టేడియం వేదికగా జరుగుతున్న మ్యాచ్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 40 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. పృథ్వీ షా (76) మెరుపు అర్ధ సెంచరీ సాధించాడు. 37 బంతుల్లోనే అతడి అర్ధ సెంచరీ పూర్తవడం విశేషం. సర్ఫరాజ్ (9 నాటౌట్), తనుష్ (20 నాటౌట్) క్రీజులో ఉన్నారు. పృథ్వీ దూకుడుతో ఆ జట్టు 274 పరుగుల భారీ ఆధిక్యంలో ఉంది. అంతకుముందు ఓవర్ నైట్ స్కోరు 289/4 వద్ద నాలుగో రోజు ఆట ఆరంభించిన రెస్టాఫ్ ఇండియా (ఆర్‌వోఐ) 410 పరుగులకు ఆలౌట్ అయింది. అభిమన్యు ఈశ్వరన్ (191) తృటిలో ద్విశతకాన్ని చేజార్చుకోగా ధ్రువ్ జురెల్ (93) సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు.

సఫారీల శుభారంభం

- **వెస్టిండీస్‌పై ఘనవిజయం**

లబ (4/29)

దుబాయ్: రెండేండ్ల క్రితం తమ సొంతగడ్డపై జరిగిన మహిళల టీ20 ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిచిన దక్షిణాఫ్రికా.. 2024 ఎడిషన్‌ను విజయంతో ఆరంభించింది. శుక్రవారం దుబాయ్‌లోని దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా గ్రూప్-బీలో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికా పది వికెట్ల తేడాతో విండీస్‌ను చిత్తుచిత్తుగా ఓడించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన విండీస్.. సఫారీ బౌలర్ల ధాటికి నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 118 పరుగులు మాత్రమే చేయగలిగింది. స్టఫానీ టేలర్ (41 బంతుల్లో 44 నాటౌట్, 2 ఫోర్లు, 1 సిక్సర్) ఆదుకోవడంతో కరీబియన్ జట్టు ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. సౌతాఫ్రికా బౌలర్లలో నొన్కులులెకొ లబ (4/29) నాలుగు వికెట్లతో విండీస్‌ను కట్టడి చేయగా పేసర్ మరిజన్నె కాప్ (2/14) రాణించింది. ఛేదనను సౌతాఫ్రికా ఓపెనర్లు కెప్టెన్ లారా వోల్వార్డ్ట (55 బంతుల్లో 59 నాటౌట్, 7 ఫోర్లు), తజ్మిన్ బ్రిట్స్ (52 బంతుల్లో 57 నాటౌట్, 6 ఫోర్లు) 17.5 ఓవర్లలో పూర్తిచేశారు. విండీస్ బౌలర్లు ఒక్క వికెట్ కూడా తీయలేకపోయారు. లబకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

రాష్ట్రానికి గుర్తింపు తెచ్చేలా స్పోర్ట్స్ పాలసీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణకు గుర్తింపు తెచ్చేలా కొత్త స్పోర్ట్స్ పాలసీని రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కొత్త స్పోర్ట్స్ పాలసీ ముసాయిదాపై శుక్రవారం సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో సీఎం పాల్గొన్నారు. అద్భుతమైన క్రీడాకారులను తీర్చిదిద్దడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు తెచ్చేలా కొత్త స్పోర్ట్స్ పాలసీని తయారుచేయాలని ఈ సందర్భంగా సీఎం అధికారులకు సూచించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వివిధ దేశాలు, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నెలకొల్పనున్న స్పోర్ట్స్ యూనివర్సిటీని యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీగా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్ వ్యవస్థ బలోపేతం

- **పైలట్ ప్రాజెక్టుగా సిరిపురం ఎంపిక**
- **ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి**

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

మధిర/ మధిర రూరల్, అక్టోబర్ 4: రాష్ట్రంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి సౌరవిద్యుత్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ప్రణాళికలు రూపొందిస్తున్నదని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(ఎన్‌పీడీసీఎల్) సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మధిర నియోజకవర్గంలోని సిరిపురం గ్రామాన్ని విద్యుత్‌శాఖ అధికారులు సందర్శించి సౌర విద్యుత్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ సిరిపురంతోపాటు కొండరెడ్డిపల్లి గ్రామాలను సౌర విద్యుత్ పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం గ్రామంలోని గృహాలు, పొలాల్లో సౌర విద్యుత్ ఏర్పాటుపై సర్వే చేస్తున్నట్లు తెలిపారు. గృహ, వాణిజ్య అవసరాలతోపాటు, రైతులకు ఉచిత సౌర విద్యుత్, పంపుసెట్లు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ పైలెట్ ప్రాజెక్టు విజయవంతమైతే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలో ప్రతి పల్లెలో అమలు చేయబోతుందని తెలిపారు. అనంతరం గ్రామంలో విద్యుత్‌శాఖ చేపడుతున్న ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఖమ్మం సర్కిల్ ఎస్ఈ సురేందర్, వైరా డీఈ హీరాలాల్, మధిర ఏడీఈ అనురాధ, రూరల్ ఏఈ నాగేశ్వరరావు, టీజీఆర్ఈ డీసీవో వీ.సీ.అనిలవాయిలా పాల్గొన్నారు.

ఆ రూ.16,500 తక్షణమే అందించాలి

- **వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి**
- **కేఎంసీ ఎదుట ధర్నాలో సీపీఎం నేతలు**

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఖమ్మం, అక్టోబర్ 4:ఖమ్మం మున్నేరు వరద బాధితులకు ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా ముంపునకు గురైన బాధిత కుటుంబాలన్నింటికీ రూ.16,500 సాయాన్ని తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. వరదలు తగ్గి నెల రోజులు దాటినా చాలా కుటుంబాలకు ఇంకా పరిహారం అందలేదని అన్నారు. ఈ మేరకు నగరంలోని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ (కేఎంసీ) కార్యాలయం ఎదుటు ఆ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నేతలు మాట్లాడుతూ.. మున్నేరు వరదల వల్ల ముంపు ప్రజలు తీవ్రంగా నష్టపోయినా ప్రభుత్వం ఇప్పటికీ వారిని పూర్తిస్థాయిలో ఆదుకోలేకపోయిందని విమర్శించారు. అరకొర సర్వేలు చేశారని, అసలైన నిర్వాసితులకు పరిహారం అందించడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. సీపీఎం నాయకులు ఎర్రా శ్రీకాంత్, ఎర్రా శ్రీనివాసరావు, మెరుగు సత్యనారాయణ, ఎల్లంపల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఆడుకోనివ్వరా?

- **కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు కనీస గౌరవం లేదు**
- **తెలంగాణ సంస్కృతిని రేవంత్ సర్కారు మంటగలుపుతోంది**
- **ఉద్యమం చేసి ఉంటే తెలంగాణ గొప్పదనం తెలిసి ఉండేది**
- **శాంతిభద్రతల నెపంతో వేడుకలను అడ్డుకోవడం సరికాదు**
- **సమావేశంలో బీఆర్ఎస్ నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు**

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఎర్రుపాలెం, అక్టోబర్ 4: 'తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ వేడుకలను భీమవరం గ్రామంలో ప్రశాంతంగా జరుపుకోనివ్వరా?' అంటూ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు, మాజీ జడ్పీటీసీ శీలం కవిత.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పంచాయతీ కార్యాలయంలో బతుకమ్మను ఆడుకోనివ్వకుండా కాంగ్రెస్ నాయకులు అధికారుల ద్వారా అడ్డుకోవడాన్ని నిరసిస్తూ మండలంలోని భీమవరం గ్రామంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామంలో గత పదేళ్లుగా బతుకమ్మ వేడుకలను ఒకే స్థలంలో జరుపుకుంటున్నామని గుర్తుచేశారు. కానీ ఇప్పుడు అదే స్థలంలో బతుకమ్మను ఆడుకోన్వివకుండా కాంగ్రెస్ నాయకులు అడ్డుకుంటున్నారని అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందనే నెపంతో అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఆంక్షలు విధించడం సరికాదని అన్నారు. స్వరాష్ట్రం కోసం ఉద్యమాలు చేసి ఉంటే తెలంగాణ సంస్కృతి గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రేవంత్‌రెడ్డికి తెలిసి ఉండేదని అన్నారు. దాని గొప్పదనం తెలియదు కాబట్టే బతుకమ్మ ఉత్సవాలను ఆయన నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు మహిళలను గౌరవించడం నేర్చుకోవాలని హితవుచెప్పారు. నాయకులు యన్నం శ్రీనివాసరెడ్డి, రామకోటేశ్వరరావు, చిన్నబాబు, జయలక్ష్మి, కృష్ణారావు, కిషోర్‌బాబు, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, పవన్, వెంకటనారాయణ, భాస్కర్, నాగేశ్వరరావు, కృష్ణాయమ్మ, మల్లేశ్వరరావు, రఘు, రవి, సూరి, అచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లేనిపోని విమర్శలు చేయొద్దు: కాంగ్రెస్

బతుకమ్మ ఆటను అధికారులను అడ్డుకున్న విషయంలో తమ పార్టీకి సంబంధం లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. రాజులదేవరపాడు గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయంలో తమ పార్టీ నాయకులపై లేనిపోని విమర్శలు చేయవద్దని కోరారు. నాయకులు నరసింహారావు, కృష్ణారావు, శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డి, పూర్ణచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

17 బృందాలతో డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 4: డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన కోసం విద్యాశాఖ అధికారులు శుక్రవారం అదనపు బృందాలను పెంచారు. ఇప్పటి వరకు 14 బృందాలతో డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన చేయగా.. శుక్రవారం మరో మూడు బృందాలను అదనంగా నియమించారు. ధ్రువపత్రాల పరిశీలన కోసం అభ్యర్థులు అధిక సంఖ్యలో రావడం, వెరిఫికేషన్‌కు గంటలకు గంటలు సమయం పడుతుండడం వంటి అంశాలపై 'ప్రక్రియ ఆలస్యమైనా.. అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయలే..' శీర్షికన 'నమస్తే తెలంగాణ' శుక్రవారం ఓ కథనాన్ని ప్రచురించింది. దీనిపై స్పందించిన డీఈవో సోమశేఖరశర్మ.. తాజాగా మరో మూడు అదనపు బృందాలను కేటాయించారు. ఒక్కో బృందంలో ఇద్దరు సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులతో పాటు ఒక జూనియర్ అసిస్టెంట్‌లను నియమించారు. మొత్తం 17 బృందాలతో ప్రక్రియను వేగవంతంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం నాటికి స్కూల్ అసిస్టెంట్ల కేటగిరీలో 372 మంది, ఎస్‌జీటీల కేటగిరీలో 644 మంది, లాంగ్వేజీ పండిట్ల కేటగిరీలో 40 మంది, పీడీ అండ్ పీఈటీల కేటీగిరీలో 19 మంది కలిపి మొత్తం 1,075 మంది సర్టిఫికెట్లను పరిశీలించారు. కాగా, శనివారంతో సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ముగియనుంది. ఇంకా స్కూల్ అసిస్టెంట్లు 136 మంది, ఎస్‌జీటీలు 211 మంది, ఎల్‌పీలు 9 మంది, పీఈ అండ్ పీఈటీలు 11 మంది కలిపి మొత్తం 367 మంది సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాల్సి ఉంది.

23 నుంచి కోటమైసమ్మతల్లి జాతర

ఉసిరికాయలపల్లిలోని కోటమైసమ్మ ఆలయం

కారేపల్లి, అక్టోబర్ 4 : కోటమైసమ్మ మహాజాతర ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించేందుకు దేవాదాయశాఖ ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నది. కారేపల్లి మండల పరిధిలోని ఉసిరికాయలపల్లిలో గల కోటమైసమ్మ ఆలయ ప్రాంగణంలో ప్రతి ఏటా విజయదశమిని పురస్కరించుకొని వారంరోజులపాటు జాతర కొనసాగుతుంది. ఈ జాతరకు తెలుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. కొలిచిన భక్తుల కోరికలు తీర్చే దేవతగా ప్రసిద్ధికెక్కిన కోటమైసమ్మ అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలు ఈ నెల 3వ తేదీ నుంచి అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. జాతర ఏర్పాట్లు ఇప్పటికే తుదిదశకు చేరుకున్నాయి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తగు సదుపాయాలు కల్పిస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

మార్కెట్‌లోకి టీవీఎస్ 'న్యూ జుపిటర్'

న్యూ జుపిటర్-110 వాహనాన్ని ఆవిష్కరిస్తున్న కేఎంసీ మేయర్ నీరజ

రఘునాథపాలెం, అక్టోబర్ 4: సరికొత్త మోడల్ వాహనాల తయారీ దిగ్గజ సంస్థ టీవీఎస్.. 'న్యూ జుపిటర్-110 సీసీ' పేరుతో మరో నూతన వాహనాన్ని ఖమ్మం మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. నగరంలోని వజ్ర టీవీఎస్ షోరూంలో దీనిని శుక్రవారం మేయర్ పునుకొల్లు నీరజ ఆవిష్కరించారు. షోరూం ఎండీ దినేశ్, కార్పొరేటర్ రాపర్తి శరత్, కంపెనీ టెరిటరీ మేనేజర్ సీఎస్ సునీల్, జీఎం శ్రీనివాస్, సేల్స్ మేనేజర్ మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు ఆహ్వానం

ఖమ్మం, అక్టోబర్ 4: వరంగల్-ఖమ్మం-నల్గొండ టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదయ్యేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎన్నికల ఉప అధికారి/అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఉపాధ్యాయులు నవంబర్ 6వ తేదీలోపు ఫారం-19 ద్వారా ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదుకు దరఖాస్తులు సమర్పించవచ్చని వివరించారు. నవంబర్ 23న ముసాయిదా జాబితా ప్రచురిస్తామని, డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని, డిసెంబర్ 25 లోపు అభ్యంతరాలను పరిష్కరిస్తామని, 30న ఓటర్ల తుది జాబితా ప్రచురిస్తామని వివరించారు. గత ఓటరు జాబితాలో పేర్లు ఉన్న వారు కూడా తప్పనిసరిగా ఫారం-19 ద్వారా మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. 2024 నవంబర్ 1వ తేదీకి ముందు ఆరేళ్లలో కనీసం మూడేళ్లపాటు సెకండరీ స్కూల్ కంటే తక్కువ స్థాయి కాకుండా విద్యాబోధనలో నిమగ్నమైన ఉపాధ్యాయులు ఓటరుగా నమోదవడానికి అర్హులని వివరించారు. తహసీల్, ఆర్డీవో కార్యాలయాల్లో నేరుగాగానీ, ceotelangana.nic.in వెబ్‌సైట్‌లోగానీ నవంబర్ 6వ తేదీ నాటికి దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు.

డిజిటల్ సర్వే త్వరగా పూర్తిచేయాలి

అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

డిజిటల్ సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

కూసుమంచి, అక్టోబర్ 4 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన పైలెట్ ప్రాజెక్టు గ్రామాల్లో జరుగుతున్న డిజిటల్ సర్వేను చిన్న తప్పు కూడా జరగకుండా త్వరగా పూర్తిచేయాలని అదనపు కలెక్